ప్రజాశక్తి
గురువారం 9 నవంబరు 2023
5
శ్రీకాకుళం

ఎసిబి కేసులో ట్రాన్స్‌కో ఎడిఇకి నాలుగేళ్ల జైలుశిక్ష

విజయనగరం: 2013లో ఎలక్ట్రికల్ లైన్ వేయడానికి ఓ వ్యక్తి నుంచి లంచం తీసుకున్న కేసులో అప్పటి శ్రీకాకుళం జిల్లా పలాస ఎడిఇ, ప్రస్తుతం ఏలూరులో ఇఇగా పనిచేస్తున్న శాసపు మధుసూదనరావుకు విశాఖ ఎసిబి కోర్టు నాలుగేళ్ల జైలుశిక్ష విధించింది. బుధవారం ఎసిబి కోర్టు న్యాయమూర్తి ఆర్‌వివిఎస్ మురళీకృష్ణ ఈ మేరకు తీర్పునిచ్చారు. 2013లో పలాసకు చెందిన కె.ప్రేమ్‌కుమార్ తన తల్లి పేరుమీదు రైసుమిల్లు నిర్మించుకున్నాడు. ఈ మిల్లుకు ఎలక్ట్రికల్ లైన్ వేయడానికి మధుసూదనరావును సంప్రదించగా, ఆయన రూ.20 వేలు డిమాండ్ చేశారు. దీంతో ప్రేమ్‌కుమార్ ఎసిబి అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో అతని నుంచి ఎడిఇ లంచం తీసుకుంటుండగా ఎసిబి అధికారులు పట్టుకొని అరెస్టు చేశారు. విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో కోర్టు మధుసూదనరావుకు నాలుగేళ్ల కఠిన శిక్ష, ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష, రూ.20 వేలు జరిమానా విధించిందని ఎసిబి డిఎస్‌పి పి.రామచంద్రరావు తెలిపారు.

విద్యాసంస్థల బంద్ ప్రశాంతం

- స్వచ్ఛందంగా సెలవు ప్రకటించిన యాజమాన్యాలు
- పలుచోట్ల ర్యాలీలు
- ఎస్ఎఫ్ఐ నాయకుల అరెస్టుకు పోలీసుల విఫలయత్నం
- బంద్‌కు మద్దతు పలికిన సిపిఎం, సిపిఐ

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి, పలాస, టెక్కలి రూరల్, ఇచ్ఛాపురం

విశాఖ ఉక్కువిశాఖ ఉక్కు పరిశ్రమ ప్రయివేటీకరణ ఆపాలి, కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు విద్యా రంగ సమస్యల పరిష్కారానికి వామపక్ష విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యాన బుధవారం చేపట్టిన విద్యా సంస్థల బంద్ ప్రశాంతంగా ముగిసింది. బంద్ నేపథ్యంలో పలు ప్రయివేట్ విద్యా సంస్థలు ముందు సెలవు ప్రకటించాయి. బంద్ సందర్భంగా పలు ప్రాంతాల్లో విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించాయి. టెక్కలిలో ఎస్ఎఫ్ఐ నాయకుల అరెస్టుకు పోలీసులు విఫలయత్నం చేశారు. బంద్‌కు సిపిఎం, సిపిఐ మద్దతు తెలిపాయి. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సిహెచ్.రాజు, నాయకులు దుర్గాప్రసాద్, ఉమామహేష్, తరుణ్ పలు ప్రభుత్వ, ప్రయివేట్ విద్యా సంస్థలకు వెళ్లి బంద్‌కు సహకరించాలని కోరారు. దీంతో వారు స్వచ్ఛందంగా పాఠశాలలు, కళాశాలలను మూసివేశారు. మరోవైపు పోలీసులు విద్యా సంస్థలకు వెళ్లి విద్యార్థులను విడిచిపెట్టొదని, పంపిస్తే కేసులు పెడతామంటూ యాజమాన్యాలను హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ నాయకులను అరెస్టు చేసేందుకు పోలీసు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. పోలీసులు కళ్లు గప్పి విద్యా సంస్థలను బంద్ చేయించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సిహెచ్.రాజు మాట్లాడుతూ విశాఖ ఉక్కును ప్రయివేట్‌పరం చేయడం ద్వారా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఈ ప్రాంతానికి తీరని అన్యాయం చేస్తోందన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ జరగకుండా అంతా అడ్డుకోవాలని అన్నారు. రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం విద్యా రంగ సమస్యలను గాలికొదిలేసిందన్నారు. సంక్షేమ వసతిగృహాల్లో కనీస సౌకర్యాలు కల్పించడం లేదని విమర్శించారు. పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలకనుగుణంగా హాస్టల్ మెస్ ఛార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. ఇంటర్, డిగ్రీ కోర్సులకు పెంచిన ఫీజులను తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో ఉర్జాన దుర్గాప్రసాద్ కమిటీ సభ్యులు ఉమామహేష్, తరుణ్ విద్యార్థులు పాల్గొన్నారు. శ్రీకాకుళంలో ఎస్ఎఫ్ఐ, ఎఐవైఎఫ్ నాయకులు పలు పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లి బంద్‌కు సహకరించాలని కోరారు. దీంతో పలు విద్యా సంస్థలు విద్యార్థులను ఇళ్లకు పంపేశాయి. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.హరీష్, సంతోష్, రాజు, నితిన్, భూపతి, మణికంఠ, ఎఐవైఎఫ్ నాయకులు యుగంధర్ పాల్గొన్నారు.

పలాస : ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఇచ్ఛాపురం : స్కూల్ వద్ద ఆందోళన చేస్తున్న నాయకులు

విద్యార్థి, యువజన సంఘాలు ఇచ్చిన బంద్ పిలుపు మేరకు పలాస, కాశీబుగ్గ జంట పట్టణాల్లో ఎఐఎస్ఎఫ్, డివైఐఎఫ్, ఎఐవైఎఫ్ సంఘాల ఆధ్వర్యాన పలాస జూనియర్ కళాశాల నుంచి ఇందిరాగాంధీ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వినోద్, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రవి మాట్లాడుతూ 32 మంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును మోదీ ప్రభుత్వం పోస్కో కంపెనీకి కట్టబెట్టాలని చూస్తోందని విమర్శించారు. స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించకుండా అన్యాయం చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జి.వాసుదేవరావు, గుణశేఖర్, పవన్, చందు, జీవన్, సునీల్ పాల్గొన్నారు. సిపిఎం నాయకులు ఎం.గణపతి, సిపిఐ నాయకులు చాపర వేణు బంద్‌కు సంఘీభావం ప్రకటించారు.

టెక్కలి రూరల్ : కళాశాల నుంచి ఇంటికి వెళ్తున్న విద్యార్థులు

ఎన్నికలకు ఇవిఎంలు సిద్ధం

- జిల్లాలో ఇప్పటి వరకు 18,26,953 ఓటర్లు
- రాజకీయ పార్టీల సమావేశంలో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎన్నికలకు ఇవిఎంలు సిద్ధంగా ఉన్నాయని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ వెల్లడించారు. కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఎలక్టోరల్స్‌పై బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇవిఎంలు పోలింగ్‌కు సిద్ధంగా ఉన్నాయని, మాక్ పోలింగ్ జరుగుతోందని అన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 18,26,953 మంది ఓటర్లు ఉన్నట్లు వివరించారు. బిఎల్ఎలను టిడిపి, వైసిపిలు మాత్రమే నియమించారని, మిగిలిన పార్టీలూ సమయం ఉన్నందున బిఎల్ఎలను నియమించుకోవాలని సూచించారు. జనవరి 5న తుది ఓటర్ల జాబితాను విడుదల చేస్తామన్నారు. ఎలక్టోరల్ రోల్ నమోదుకు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. అపీళ్లు , అభ్యంతరాలను దాఖలు చేయడానికి వ్యవధి డిసెంబరు 9 వరకు ఉందన్నారు. అపీళ్లు, అభ్యంతరాలను ఉపసంహరించుకునేందుకు డిసెంబరు 26 వరకు గడువు ఉంటుం దన్నారు. అలాగే ఫారం-6,7, తదితర ఫారాలపై ఉన్న అనుమానాలను కలెక్టర్ నివృత్తి చేశారు. తొలగింపులు ఉంటే ఫారం-7 తప్పని సరిగా ఉండాలన్నారు. ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకునేందుకు వీలుందన్నా రు. మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ మాట్లాడుతూ తొలగించిన మృతుల వివరాలు ఇవ్వాలని కోరారు. పాతపట్నం నియోజకవర్గం పరిధిలోని మెట్టూరు పోలింగ్ కేంద్రాల సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అదనంగా అక్కడ ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. టిడిపి నాయకులు పి.ఎం.జె.బాబు పొందూరు మండలంలో రేషనలైజేషన్‌లో పోలింగ్ కేంద్రాన్ని మార్చడంపై అభ్యంతరం తెలిపారు. ఈ పోలింగ్ కేంద్రాన్ని మార్చడంతో అతి సమస్యాత్మక ప్రాంతంలో పోలింగ్ కేంద్రాన్ని నిర్వహించే వీలుందని ప్రస్తావించారు. అలాగే గార మండలం మొగదలపాడులో పోలింగ్ మార్పు చేయాలని కోరారు. అంతకుముందు వివిధ రాజకీయ పార్టీలతో గొడౌన్‌లోని ఇవిఎంలు కలెక్టర్ పరిశీలించారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, సిపిఎం భవిరి కృష్ణమూర్తి, వైసిపి నాయకులు నుంచి రౌతు శంకరరావు, కాంగ్రెస్ నుంచి డి.గోవిందమల్లిబాబు, బిఎస్‌పి ఎల్.సోమేశ్వరరావు, సిసెక్షన్ సూపరింటెండెంట్ ప్రకాశరావు, డిటి సనపల చక్రవర్తి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

కేసులపై ప్రత్యేక శ్రద్ధ

మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జైలు ముద్దాయిల కేసులు త్వరితగతన పరిష్కరించేందుకు ప్రభుత్వ యంత్రాంగం సమిష్టిగా కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా సూచించారు. జిల్లా కోర్టు ఆవరణలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో అండర్ ట్రయిల్ ప్రిజనేర్స్ రివ్యూ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జైలు ముద్దాయిల కేసులు త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పోలీసు, ఎక్సైజ్ కేసుల పరిష్కారంలో జాప్యం కూడదన్నారు. కేసులు విచారణ పూర్తి చేసి త్వరితగతను ఛార్జిషీట్ ఫైల్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా అదనపు న్యాయమూర్తులు శ్రీదేవి, మహేంద్ర ఫణికుమా ర్, భాస్కరరావు, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, డిఆర్ఒ గణపతిరావు, అడిషనల్ ఎస్‌పి తిప్పేస్వామి, జిల్లా జైలు సూపరింటెండెంట్ నబి ఖాన్, సబ్ జైలు అధికారులు, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ మెట్ట మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

కిడ్నీ ఆస్పత్రి పనులు వేగవంతం

పశుసంర్ధకశాఖ మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పద్మనాభపురం వద్ద రూ.50 కోట్లతో నిర్మిస్తున్న 200 పడకల ఆస్పత్రితో పాటు, కిడ్నీ పరిశోధన కేంద్రం పనులు వేగవంతం చేసి ఈ నెల 23న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆదేశించారు. కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, ఎస్‌పి జి.ఆర్.రాధిక, జాయింట్ కలెక్టర్ నవీన్‌తో కలసి చేపడుతున్న ఆస్పత్రి పనులను బుధవారం పరిశీలించారు. ముందుకుగా ముఖ్యమంత్రి హెలీక్యాపర్టర్ ల్యాండింగ్ ప్రాంతం కోసం కాశీబుగ్గ డిఎస్‌పి కార్యాలయం ఎదురుగా ఉన్న పోలీసు మైదానాన్ని పరిశీలించారు. అలాగే సభ స్థలం కోసం పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానం, పారిశ్రామికవాడ ఎదురుగా ఉన్న స్థలం, పలాస రైల్వే క్రీడామైదానం స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇప్పటికే 90 శాతం పనులు పూర్తి అయ్యాయని, మరో పది శాతం పనులు ప్రారంభోత్సవానికి ముందే పూర్తి అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉద్దాన ప్రాంత రోగులకు ఈ ఆస్పత్రి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ భరత్‌నాయక్, కాశీబుగ్గ డిఎస్‌పి నాగేశ్వరరెడ్డి, తహశీల్దార్ మధుసూదనరావు, ఆర్ఐ నిరంజనరావు, పలాస మున్సిపల్ కమిషనర్ నాగేంద్రకుమార్, విఆర్ఒ ఖగేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ బోర కృష్ణారావు, వైసిపి జిల్లా కార్యదర్శి పాలిన శ్రీనివాసరావు, మందన ఎంపిపి దానయ్య, నాయకులు దున్న సత్యం, గౌరీ త్యాడి, టి.శాంతారావులు పాల్గొన్నారు.

సిఎం సభా స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి, కలెక్టర్, ఎస్‌పి

ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి

- జిల్లా వ్యాప్తంగా నేడు ప్రారంభం
- వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన క్రిష్ణదాస్

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లా వ్యాప్తంగా గురువారం నుంచి ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి (వై ఎపి నీడ్స్ జగన్) అనే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు నరసన్నపేట ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ చెప్పారు. నగరంలోని స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రతి మండలంలోనూ ఒక్కో గ్రామ సచివాలయంలో తమ పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు ప్రారంభిస్తారని తెలిపారు. గతేడాది కాలంగా గడప గడపకూ ప్రభుత్వం పేరుతో ప్రజల్లోకి వెళ్లి తామేమీ చేశామో, ఏం చేయగలమో ప్రజలకు చెప్పామన్నారు. అందరి కంటే ముందు మేమేమీ చేశామో, ఏం చేయగలమో చెప్పేశాము... ప్రభుత్వం చేసిన సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. జగన్‌తోనే ఇవన్నీ సాధ్యమనే విషయాన్ని ప్రతి ఒక్కరికీ తెలియజేయాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. ప్రతి గ్రామంలోనూ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల వివరాలతో బోర్డులు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. అనర్హులు ఎవరైనా ఉంటే వెంటనే గుర్తించి వారికి సంక్షేమ అభివృద్ధి ఫలాలు అందేలా కృషి చేస్తామని చెప్పారు. దేశంలో జిడిపి అభివృద్ధి రేటు కలిగిన రాష్ట్రాల్లో ఎపికి మొదటి స్థానం దక్కిందన్నారు. తలసరి ఆదాయంలో టాప్ 10 రాష్ట్రాల్లో 9వ స్థానంలో ఉందని తెలిపారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు 4,93,000 ఉద్యోగాలను కల్పించామన్నారు. టిడిపి ఐదేళ్లలో 34,108 మందికే ఉద్యోగాలు ఇచ్చిందన్నారు. పరిశ్రమల వృద్ధిరేటులో రాష్ట్రం మూడో స్థానంలో ఉందని చెప్పారు. రాష్ట్రంలో 31 లక్షల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చామని, 22 లక్షల ఇళ్లు నిర్మించామని వెల్లడించారు. కొత్తగా నాలుగు ఓడరేవులు, 10 షిప్పింగ్ హార్బర్లు, రెండు విమానాశ్రయాలు, 17 మెడికల్ కాలేజీలు ఏర్పాటుకు అనుమతులిచ్చామని తెలిపారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నూటికి నూరు శాతం అమలు చేసిన పార్టీగా వైసిపి మాట నిలబెట్టుకుందన్నారు. సమావేశంలో కళింగ కోమటి కార్పొరేషన్ ఛైర్మెన్ అంధవరపు సూరిబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ శిమ్మ రాజశేఖర్, పార్టీ నాయకులు చింతాడ రవికుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కృష్ణదాస్

మాట్లాడుతున్న రెవెన్యూ మంత్రి ప్రసాదరావు

మౌలిక వసతుల కల్పనే ధ్యేయం

మాట్లాడుతున్న మంత్రి ప్రసాదరావు

శ్రీకాకుళం అర్బన్ : ప్రభుత్వ విద్యారంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చిత్త శుద్ధితో పనిచేస్తుందని, అందులో భాగంగా పాఠశాలలకు మౌలిక వసతులను కల్పించి విద్యార్థులకు మంచి విద్యా బోధన అందించేందుకు కృషి చేస్తున్నామని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల రూ.1.16 కోట్ల వ్యయంతో నిర్మించిన అదనపు తరగతులను బుధవారం ప్రారంభించారు. అదనపు గదుల నిర్మాణం వేగంగా పూర్తి చేసిన ఏజెన్సీ ప్రతినిధులను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్ విద్య, వైద్య రంగాలకు సముచిత ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. సమగ్ర శిక్షా అభియాన్ నిధులతో రూపుదిద్దుకున్న ఈ భవనం ఇక్కడి విద్యార్థులకు వసతి సమస్యలను తీరుస్తుందన్నారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నాడు-నేడులో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయన్నారు. విద్యారంగంలో జిల్లా అధికారులు చేస్తోన్న కృషి అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో పనిచేస్తూ ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చాలని కోరారు. విద్యతోనే సమాజంలో గౌరవం ఉంటుందన్నారు. సమగ్ర శిక్షా ఎపిసి డాక్టర్ రోణంకి జయప్రకాష్, కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, హెచ్ఎం విజయలక్ష్మి, డెప్యూటీ డిఇఒ పగడాలమ్మ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా ఉపాధి కల్పనాధికారి ఆధ్వర్యాన ఈ నెల 10న గవర్నమెంట్ డిఎల్‌టిసి, ఐటిఐ, ఆవరణలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ఉపాధి అధికారి కొత్తలంక సుధ ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో పేటిఎం, 2050 హెల్త్ కేర్, వరుణ్ మోటార్స్ కంపెనీ కంపెనీల్లో ఉద్యోగ నియామకాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. పేటిఎం కంపెనీలో 199 ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యుటివ్‌లు ఖాళీ ఉన్నట్టు తెలిపారు. నెలకు జీతం రూ.13,500 నుంచి రూ.21,000 వరకు వేతనం ఉంటుందన్నారు. ఎస్ఎస్‌సి, ఆ పైన విద్యార్హత కలిగిన 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయసు ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. 2050 హెల్త్ కేర్ కంపెనీలో 50 ఖాళీలున్న నర్సింగ్ అసిస్టెంట్లు, హోం కేర్ నర్స్, క్రిటికల్ కేర్ నర్స్ పోస్టులకు ఇంటర్వ్యూలు జరగనున్నట్టు చెప్పారు. బిఎస్‌సి నర్సింగ్/ఎఎన్ఎం/జిఎన్ఎం/ జిడిఎ/ఎఎన్ఎం విద్యార్హత కలిగి ఉండి 19 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు ఉన్న స్త్రీ, పురుష అభ్యర్థులు అర్హులన్నారు. అలాగే వరుణ్ మోటార్స్‌లో 15 ఖాళీలను భర్తీ చేయనున్నట్టు తెలిపారు.

అభివృద్ధిలో టౌన్ ప్లానింగ్ పాత్ర కీలకం

కార్పొరేషన్ కమిషనర్ ఓబులేషు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరాలు, పట్టణాలు ఒక క్రమపద్ధతిలో అభివృద్ధి చెందాలంటే టౌన్ ప్లానింగ్ విభాగం కీలకపాత్ర పోషిస్తుందని నగర కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేష్ స్పష్టం చేశారు. వరల్డ్ టౌన్ ప్లానింగ్ డేను పురస్కరించుకొని నగరం లోని డిసిసిబి కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన అర్బన్ హెల్త్ సెంటర్‌లో బుధవారం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీకాకుళం నగరాన్ని రానున్న 30 ఏళ్లు దృష్టిలో పెట్టుకొని మాస్టర్‌ప్లాన్ తయారు చేశామని, ఇప్పటికే మాస్టర్ ప్లాన్‌పై ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నామని చెప్పారు. డిసెంబరు 4న సదస్సు ఏర్పాటు చేసి అన్ని వర్గాల అభిప్రాయాలు తీసుకొని చక్కని మాస్టర్ ప్లాన్ తయారు చేస్తామ న్నారు. పట్టణ ప్రణాళికా రూపకల్పనలో అన్ని వర్గాల వారి అభిప్రాయాలు తెలుసుకొని భవిష్యత్‌లో ఒక మోడల్ నగరంగా శ్రీకాకుళాన్ని తయారు చేయడమే తమ లక్ష్యమన్నారు. కాలుష్య రహిత, పర్యావరణ హితాన్ని కోరే నగరంగా శ్రీకాకుళం భవిష్యత్‌లో రూపుదిద్దుకుంటుంద న్నారు. అనంతరం నగర పాలక సంస్థ కార్యాల యంలో ప్రపంచ పట్టణ ప్రణాళిక దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.సుగుణాకరరావు, టౌన్‌ప్లానింగ్ విభాగం ఎసిపి ఐ.వి.రమణమూర్తి, టిపిఒ వై.ఉమామహేశ్వరరావు, జిల్లా లైసెన్స్డ్ ఇంజినీర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కె.వి.ఎన్.ఎస్.వి.ప్రసాద్ (హారికాప్రసాద్), ముని శ్రీనివాసరావు, డి.సుధాకరరావు, ఎం.ఎస్.విజయ్‌కుమార్, నగర పాలన సంస్థ ప్రధాన వైద్యాధికారి వెంకటరావు, టౌన్ ప్లానింగ్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కను నాటుతున్న కమిషనర్ ఓబులేషు

భవన నిర్మాణ అనుమతులపై ఎసిబి కన్ను!

ప్రజాశక్తి- పలాస

జిల్లాలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణాల్లో పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ఒకటి. ఇటీవల కాలంలో విపరీతంగా భవన నిర్మాణాలు జోరందుకుంటున్నాయి. ఎటువైపు చూసిన భవనాలు, అంతస్తులు, అపార్ట్‌మెట్లు విపరీతంగా నిర్మాణాలు జరుగుతున్న నేపథ్యంలో ఎసిబి అధికారులు తనిఖీలు మొదలుపెట్టారు. ఇదిలా ఉండగా పెద్ద భవంతులపై అధికార పార్టీకి చెందిన నాయకుల కన్ను పడింది. భవన యజమానుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎదురు తిరిగిన వారికి ఎసిబి అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అధికారులు మాత్రం ప్రతి మున్సిపాలిటీలోనూ తనిఖీలు చేస్తున్నామని, అందులో భాగంగా మున్సిపాలిటీలో పెద్ద భవనాలపై తనిఖీలు చేస్తున్నట్లు చెబుతుండడం గమనార్హం.

టౌన్ ప్లానింగ్ విభాగంలో ఏం జరుగుతుంది?

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ విభాగంలో ఏం జరుగుతుందో ఎవరికీ అంతు చిక్కడం లేదు. ఈ విభాగంలో రెండేళ్లుగా సుమారు ఆరుగురు టౌన్ ప్లానింగ్ అధికారులు మారినట్లు అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది. అందులో భాగంగా టిపిఒగా పని చేసిన రేవతి విశాఖపట్నం కార్పోరేషన్‌కు బదిలీపై వెళ్ళిపోగా ఆ సమయంలో టిపిఎస్‌గా పని చేస్తున్న వెంకటేశ్వరరావు ఇన్‌ఛార్జి టిపిఒగా పనిచేశారు. ఆయన బదిలీపై వెళ్లిపోవడంతో సిహెచ్.నారాయణ, కె.బాలరాజు, సత్యనారాయణ, సీతారాం ఇలా అధికారులు కొద్ది రోజులు పనిచేస్తూ ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. చివరకు టిపిఒగా పనిచేసి ఉద్యోగోన్నతిపై సీతారాం వెళ్లిపోగా, ఆయన స్థానంలో ప్రస్తుతం శ్రీకాకుళం మున్సిపాలిటీలో టిపిఎస్‌గా పని చేసి ఉద్యోగోన్నతిపై టిపిఒగా అప్పలరాజు వచ్చారు. అయితే గతంలో టిపిఎస్‌గా సిహెచ్.నారాయణ పనిచేస్తున్న సమయంలో సచివాలయ టౌన్ ప్లానింగ్ సిబ్బంది కలుగజేసుకుని వారే అనుమతులు ఇవ్వడంతో జంట పట్టణాల్లో అనేక భవన నిర్మాణాలు వెలిశాయి. ఉన్నతాధికారులు సెలవుపై వెళ్లిన సందర్భాల్లో వారి డిజిటల్ సంతకం సచివాలయ టౌన్ ప్లానింగ్ సిబ్బందికి అందజేయడంతో ఈ చీకటి వ్యవహారాలు జోరుగా ఊపందుకున్నాయి. సిబ్బందికి భారీగా ముడుపులు అందినట్లు తెలుస్తోంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీకు టౌన్ ప్లానింగ్ విభాగంలో టిపిఎస్, టిపిఒలుగా పని చేసేందుకు ముందుకు రావడం లేదు. వచ్చినా కుంటుసాకులు చూపి వేరే చోటకు వెళ్లిపోతున్నారు.

16 మంది భవంతులు తనిఖీ?

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో గత శుక్ర, శనివారాల్లో శ్రీకాకుళం ఎసిబి అధికారులు టౌన్ ప్లానింగ్ విభాగంపై తనిఖీలు చేపట్టారు. అందులో భాగంగా మున్సిపాలిటీకి చెందిన బరాటం సత్యనారాయణ, మల్లా రాఘవేంద్ర, నిత్యానంద పండా, మల్లా నరసింహమూర్తి, సిందిరి గాయత్రి, బెల్లాల పరమేశ్వరి, మల్లా త్రినాథరావు, వడ్డీ విఠల్ కుమార్, తంగుడు విజయలక్ష్మి, సంపతిరావు విజయ్‌కుమార్, తాళాసు సునీత, తాళాసు పాండురంగారావు, కొంచాడ హరికృష్ణ, చౌదరి రంజిత్ కుమార్, విక్రమ ఆదిత్య పండాల భవనాలు పరిశీలించడమే కాకుండా వాటి రికార్డులను క్షుణ్ణంగా ఎసిబి అధికారులు పరిశీలించినట్లు తెలుస్తోంది. అయితే అధికార పార్టీకి చెందిన నాయకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకే ఎసిబి అధికారులు తనిఖీలు చేపడుతున్నారా? తమ విధి నిర్వహణలో తనిఖీలో భాగంగా తనిఖీలు చేపడుతున్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు మాత్రం తమ విధి నిర్వహణలో భాగంగానే తనిఖీలు చేపడుతున్నట్లు చెబుతున్నారు.



తనిఖీలు చేస్తున్న ఎసిబి అధికారులు (ఫైల్)

భవన యజమానుల నుంచి వసూళ్లు!

పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవన యజమానులను కొంత మంది అధికార పార్టీకి చెందిన నాయకులు బెదిరించి వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. వీరివలలో పడని భవన యజమానులపై ఉన్నతాధికారులు, ఎసిబి అధికారులకు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని వీరే ఫిర్యాదు చేసి వారికి మూడు చెరువుల నీళ్లు తాగిస్తున్నారు. మరి కొంతమంది ఎందుకురా తలనొప్పి అంటూ వారు కోరిన విధంగా ముట్ట చెబుతున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగా కొంతమంది యజమానుల నుంచి లక్షలాది రూపాయలు అధికారపార్టీకి చెందిన వ్యక్తులకు ముడుపుల రూపంలో ముట్టినట్లు ప్రచారంలో ఉంది.

అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ నూరల్ కమర్

కాలువ నిర్మాణానికి చర్యలు

సబ్ కలెక్టర్ నూరల్ కమర్

కొత్తూరు : స్థానిక ప్రభుత్వ కళాశాల రహదారిలో ఏడాది కాలంగా మురుగునీరు రహదారి పారుతుండంతో సమస్య పరిష్కారానికి ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రహదారి బైఠాయింపు, రాస్తారోకో, రేలేదీక్షలు, రహదారి ద్రిగ్భంధనం, ఆందోళనలు చేయడంతో అధికారులు స్పందించారు. మురుగు సమస్య పరిష్కరించేందుకు రైతులతో మాట్లాడి కాలువ నిర్మాణం చేసేందుకు 5 అడుగుల పొడవున కాలువ నిర్మాణం చేయాలని టెక్కలి సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం సబ్‌కలెక్టర్ మూసివున్న ఆర్అండ్‌బి కల్వర్ట్‌ను, రహదారిపై పారుతున్న మురుగునీరు, కాలువ నిర్మానికి కావాల్సిన స్థలాన్ని పరిశీలించారు. సర్వేయర్ జనార్ధనరావు నివేదిక ఇవ్వాల్సి ఉందని నివేదిక వచ్చిన వెంటనే అక్రమదారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈయనతో పాటు తహశీల్దార్ ఎం.చక్రవర్తి, సర్వేయర్ ఆనంతకుమార్, విఆర్ఒలు రాము, కల్యాణి, సెక్రటరీ బట్టో, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

21న పురందేశ్వరి పర్యటన

రణస్థలం రూరల్: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు దగ్గుపాటి పురందేశ్వరి 21న విజయనగరం జిల్లాకు రానున్నారని జిల్లా అధ్యక్షులు, ఎచ్చెర్ల అసెంబ్లీ కన్వీనర్ నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఇఆర్) ఒక ప్రకటనలో కోరారు. ఆ రోజున ఆనంద గజపతి ఆడిటోరియంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఉంటుందని అన్నారు. జిల్లాలోని నాలుగు మండలాల నుంచి బూత్ కమిటీ అధ్యక్షులు, మండల పార్టీ అధ్యక్షులు పాల్గొన్న కోరారు.

సాగునీరు అందించడంలో విఫలం

వజ్రపుకొత్తూరు : వంశధార శివారు భూములకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సిపిఎం నాయకులు బమ్మిడి ఆనందరావు, ఎన్.మోహనరావు అన్నారు. బుధవారం నగరంపల్లి, సీతాపురం, పెద్దబొడ్డపాడు, కొండవూరు, కూర్మనాధపురం గ్రామాల్లో నీరులేక ఎండిన పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఆగష్టు నెలలో కురిసిన కొద్దిపాటి వర్షానికి రైతులు ఉబాలు చేసుకున్నారని, సెప్టెంబర్, అక్టోబర్‌లో వర్షాలు పూర్తిగా లేకపోవడంతో పొట్టదశలో పంటలు ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిధిలో 60 ఆర్ఎల్ కాలువ ద్వారా వంశధార నీరు అందించాల్సి ఉన్నప్పటికీ సాగునీరు అందించడంలో ప్రభుత్వ వైఫల్యం వలన పంటలు పూర్తిగా ఎండిపోయాయన్నారు. కాలువల్లో పూడికలు తీయకుండా ప్రభుత్వ వైఫల్యాన్ని గత పాలకులపై నెట్టేసి ప్రభుత్వం తన బాధ్యతల నుండి తప్పించుకొనే ప్రయత్నం సరికాదు అన్నారు. వంశధార శివారు భూములకు సాగు నీరు అందించక పోవడం ముమ్మాటికీ పాలకుల చేతకానితన మేనని విమర్శిస్తున్నారు. వీరితో పాటు సిపిఎం నాయకులు బి.రామకృష్ణ, టి.భాస్కరరావు, ఎన్.చంద్రయ్య, బైరాగి, బి.సుగుణవతి ఉన్నారు.

ఎండిన పంటలను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

రూపాయి అవినీతినైనా నిరూపించలేరు

టిడిపి జిల్లా అధ్యక్షులు రవికుమార్

ప్రజాశక్తి- పొందూరు

టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుపై అక్రమంగా కేసులు బనాయించి, అక్రమంగా అరెస్టు చేసారే తప్ప ఆయనపై సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఒక్క రూపాయి అయినా అవినీతిని నిరూపించగలిగారా అంటూ టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ ప్రశ్నించారు. మండలం దల్లిపేట గ్రామంలో బుధవారం టిడిపిలో చేరిన మాజీ సర్పంచ్ బడి రఘురాంరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగసభలో ఆయన మాట్లాడారు. నాలుగున్నరేళ్లుగా రాష్ట్రంలో అరాచక పాలన సాగుతుందని, రాష్ట్ర ప్రజలు ఓటు అనే వజ్రాయుధంతో నరకాసుర పాలనను అంతమొందించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. గుంతలు పడిన రహదారులతో ఎంతో మంది మృత్యువాత పడుతుండగా, ఎంతో మంది క్షతగాత్రులు అవుతున్నారన్నారు.

వైసిపి నుంచి టిడిపిలోకి భారీ చేరికలు...

దల్లిపేట గ్రామంలో బుధవారం టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ సమక్షంలో సుమారు 250 కుటుంబాలకు చెందిన 500 మంది వైసిపి నుంచి టిడిపిలో చేరారు. గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ బడే రఘురామరెడ్డితో పాటు, మాజీ సర్పంచ్‌లు బడే జయలక్ష్మి, లంగు ముసలమ్మ, ప్రస్తుత పంచాయతీ వార్డు సభ్యులు పల్ల సిగడం, దల్లి రమణమ్మ, బాకి తులసి, లంగు లక్ష్మి, జీరు పార్వతమ్మతో పాటు పలువురు టిడిపిలో చేరారు. మాజీ సర్పంచ్ రఘురాంరెడ్డి మాట్లాడుతూ వైసిపిలో గ్రూపులు కారణంగా గ్రామం అభివృద్ధికి నోచుకోకపోవడంతో తాము ఎంతో నష్టపోయామన్నారు. ఏకనాయకత్వం గల రవికుమార్‌తో కలిసి పనిచేసేందుకు తామంతా ముందుకు వచ్చామన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శిలు చిగిలిపల్లి రామ్మోహనరావు, వండాన మురళీ, ఉపాధ్యక్షులు బాడాన శేషగిరినాయుడు, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు కూన వెంకటసత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి సీపాన శ్రీరంగనాయకులు, జిల్లా తెలుగుయువత ప్రధాన కార్యదర్శి బలగ శంకర భాస్కరరావు, మాజీ ఎఎంసి చైర్మన్ అన్నెపు రాము, నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షులు చింతాడ కృష్ణవాసుదేవరావు, లోలుగు వెంకట్, పోలినాయుడు, పొన్నాడ రామారావు, కె.శాంతారాం, శ్రీరంగ, బొడ్డేపల్లి సత్యం తదితరులు పాల్గొన్నారు.

రఘురాంరెడ్డికి కండువా వేస్తున్న రవికుమార్

కర్షకుని కడుపు కొడుతున్న 'కరువు' నిబంధనలు

వ్యవసాయ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే అశోక్

ప్రజాశక్తి- కవిటి

ఈ ఏడాది పూర్తిస్థాయిలో వర్షాలు లేక పంటలు పాడైన రైతులు ఏడుస్తుంటే శాటిలైట్ సర్వేలు, రిమోట్ సెన్సింగ్ పరిశీలనల ద్వారా అంతా సుభిక్షంగా ఉందని చెప్పుకుంటూ ప్రభుత్వం రైతుల నడ్డివిరుస్తోందని ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల వర్షాలు లేక ఎండిపోయిన వరిచేలు పరిశీలించిన ఎమ్మెల్యే వ్యవసాయ, విద్యుత్ శాఖ అధికారులతో బుధవారం తన క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజవర్గంలోని నాలుగు మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నా, నాట్లుపడ్డ పొలాల్లో చాలా వరకు చేలు ఎండిపోయినా ఎందుకు కరువు మండలాలుగా ప్రకటించలేదని, ఏయే ప్రామాణికాలు పరిగణలోకి తీసుకుని కరువు అంచనా వేస్తారని అధికారులను ప్రశ్నించారు. భూగర్భ జలాలు, నీటి పారుదల, పచ్చదనం వంటివి రిమోట్ సెన్సింగ్, శాటిలైట్ సర్వేల ద్వారా ఎలా అంచనా వేస్తారని, ఇది కేవలం రైతులను మోసగించి ఇన్‌పుట్ సబ్సిడీ ఎగ్గొట్టే ప్రయత్నమేనని విమర్శించారు. పండిన ధాన్యం గత ఏడాదిలా టెక్కలి, నరసన్నపేట వరకు రైతులు పట్టుకెళ్లేలా కాకుండా ఈ నాలుగు మండలాల్లో ఉన్న మిల్లులకు అందజేసేలా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ ఎడి కె.జగన్మోహనరావు, సోంపేట, కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం ఎఒలు బి.నరసింహమూర్తి, పి.సత్యనారాయణ, ధనుంజయ, తిలక్, ఎలక్ట్రికల్ ఎఇ నేతాజీ, వ్యవసాయ సహాయకులు కళ్యాణ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మోహనరావు

ఆ భూమి గిరిజనులకు అప్పగించాలి

మెళియాపుట్టి : మండలంలోని పరశురాంపురం పంచాయతీ నందవ రెవెన్యూ గ్రూప్ పరిధిలో పెద్దమడి గ్రామం వద్ద గిరిజనులు సాగు చేస్తున్న 12ఎకరాల 67 సెంట్లు భూమి వాళ్లకే అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, గిరిజన సంఘం జిల్లా నాయకులు సవర ఆదినారాయణ, జన్ని రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం గిరిజనులు సాగు చేస్తున్న భూములను పరిశీలించారు. గిరిజనేతరుల పేర్లపై పట్టాలు ఉన్నప్పటికీ గిరిజనులు కొన్నేళ్లుగా సాగు చేస్తున్నారని వారికి హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. సర్వే నెంబరు 65/2లో 2 ఎకరాల 90 సెంట్లు ప్రభుత్వ భూమిని అడంగల్‌లో చూపిస్తుందని ఆ భూమి సరస్వతమ్మకి పట్టా ఎలా అయిందో చెప్పాలన్నారు. కార్యక్రమంలో టి.హేమ, టి.మహాలక్ష్మి, వీరయ్య, చిన్నారావు, చాణిక్యరావు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో పారదర్శకత పాటించాలి

కోటబొమ్మాళి: విధులు నిర్వహణలో పారదర్శకత పాటించాలని సీనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి వి.సతీష్ బాబు అన్నారు. బుధవారం ఎన్ఆర్ఇజిఎస్ కార్యాలయ సమావేశ మందిరంలో సాంకేతిక సహాయకులకు, క్షేత్ర సహాయకులకు నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పనులు గుర్తింపులో, పనుల నిర్వహణలో, వేతనాలు చెల్లింపులో పారదర్శకత పాటించాలని సూచించారు. అలాగే జన్మ నరేగా, జలదూత్, క్లాట్ యాప్‌లపై క్షేత్ర సహాయకులకు అవగాహన కల్పించారు. అలాగే పండ్లతోటల పెంపకాలపై రైతులకు అవగాహన కల్పించి పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో జూనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి కెళ్లి గోవిందరావు, జెఇ జి.హరిప్రసాద్ ఉన్నారు.

ఐటిడిఎ పిఒ పర్యటన

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలో సీతంపేట ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి విస్తృతంగా బుధవారం పర్యటించారు. మండలంలో హడ్డివాడ, కేరాసింగి గూడ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డు పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని సూచించారు. పనుల్లో నాణ్యత లోపించకూడదన్నారు. రోడ్డుపనులపై గ్రామస్తులతో మాట్లాడారు. రోడ్డు పనులను వేగవంతం చేయిస్తామని వారికి హామీ ఇచ్చారు. అనంతరం డేగల పోలూరు జిపిఎస్ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. పాఠశాలను సందర్శించి పాఠశాల విద్యా ప్రమాణాలను పరిశీలించి నివేదిక తనకు సమర్పించాలని ఎంపిడిఒ, వెల్ఫర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌కు సూచించారు. గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఉన్న గ్రానైట్ సమస్యను పరుష్కరించుటకు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అలాగే చింతల పోలూరు గ్రామాన్ని సందర్శించి గ్రామస్తులతో మాట్లాడారు. విద్యార్థులు తక్కువ మంది ఉన్నారనే కారణంతో గ్రామంలోని పాఠశాలను మూసివేశారని, మరలా పాఠశాల తెరవాలని గ్రామస్తులు పిఒని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పి.చంద్రకుమారి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న పిఒ కల్పనాకుమారి

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- పోలాకి

సింహాచలం మృతదేహం

మండలంలో ఒకవ్యక్తి అనుమానాస్పద మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. దీనిపై పోలీసులు తెలిపిన వివరాల మేరకు సుసరాం గ్రామానికి చెందిన తమ్మినాన సింహాచలం(59) అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతి చెందిన సింహాచలం పొలానికి నీరు కట్టుటకు తమ గ్రామానికి కిలోమీటరు దూరంలో గాతలవలస రెవెన్యూలో ఉన్న పొలానికి నీరు కట్టేందుకు రెండు రోజులుగా వెళ్తున్నారని, ముందురోజు వెళ్ళినప్పుడు నీరుకోసం దువ్వవలస గ్రామస్తులతో గొడవపడి ఇంటికి వచ్చారని, అలాగే 7వ తేదీ మధ్యాహ్నం భోజనం చేసిన తరువాత ఒక్కరే వెళ్లారని తెలిపారు. అయితే సాయంత్రానికి సుసరాం గ్రామానికి చెందిన తమ్మినాన సీతారాం వచ్చి సింహాచలం గాతలవలస గెడ్డ ప్రక్కన స్పృహ కోల్పోయి పడిఉన్నాడని సమాచారం ఇవ్వగా కుటుంబ సభ్యులు వెళ్లిచూడగా అప్పటికే చనిపోయి ఉన్నాడని తెలిపారు. మానాన్న మృతికి ముందురోజు గొడవపడిన వారే కారణమై ఉండవచ్చునని కుమార్తె సనపల సూరమ్మ ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతుడికి భార్యతో పాటు కుమార్తె, కుమారుడు ఉన్నారు. .కుమార్తె సూరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పుస్తెల తాడు చోరీ

ప్రజాశక్తి- లావేరు

మండలం గుమ్మడాం పంచాయతీ నాగంపాలెం గ్రామానికి చెందిన జగ్గురోతు సూరీడమ్మ వేణుగోపాలపురంలో బుధవారం 12.30 గంటల సమయంలో ఓ శుభకార్యానికి వస్తుండగా మార్గ మధ్యంలో ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై వచ్చి ఆమె మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారం తాడును చోరీ చేశారు. చోరీకి పాల్పడిన సమయంలో మహిళ ప్రతిఘటించినప్పటికీ బలవంతంగా తాడులాక్కొని పరారయ్యారు. దీంతో మహిళ చేతికి స్వల్ప గాయమైంది. బంధువుల శుభకార్యానికి పక్కింటి వారి దగ్గర తీసుకుని వేసుకున్న బంగారుతాడు దుండగులు చోరీకి పాల్పడడంతో ఏం చేయాలో అర్థమవ్వక లబోదిబోమంటుంది. ఇప్పుడు రూ.1.80 లక్షల విలువ చేసే తాడును అపహరించారని బాధితురాలు బోరున విలపిస్తుంది. చోరీ ఘటనపై లావేరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎఎస్ఐ ప్రసాదరావు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మహిళ మెడలో బంగారపు తాడు చోరీ జరగడంతో ఇరు గ్రామాలు ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

సీనియర్ జర్నలిస్టు కుబాకర్ మృతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కుబాకర్ (ఫైల్)

సీనియర్ జర్నలిస్టు, ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, పూర్వ జిల్లా ఉపాధ్యక్షుడు కూటికుప్పల కుబాకర్ (39) బుధవారం ఉదయం కన్నుమూశారు. కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ కొద్ది రోజులుగా అనారోగ్యంతో జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. పరిస్థితి విషమించడంతో బుధవారం తెల్లవారు జామున తుది శ్వాస విడిచారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. శ్రీకాకుళం రూరల్ మండలం కూటికుప్పలపేట గ్రామంలో ఆయన అంత్యక్రియలు బంధు, మిత్రుల సమక్షంలో మధ్యాహ్నం జరిగాయి. అంత్యక్రియల్లో ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా కార్యదర్శి జి.లక్ష్మణరావు పాల్గొని కడసారి వీడ్కోలు పలికారు. గత రెండు దశాబ్దాలుగా పాత్రికేయ వృత్తిలో కుబాకర్ కొనసాగుతూ వివిధ పత్రికల్లో విలేకరిగా పనిచేశారు. అనంతరం కొన్నేళ్లుగా సొంతంగా అక్షరసత్యం మాసపత్రికను స్థాపించి నడిపిస్తున్నారు. పాత్రికేయ వృత్తితో పాటు ఆయన నాటక రంగంపై ఆసక్తి కలిగి ఉండడం వల్ల పలు సాంఘిక నాటకాల్లో పలు పాత్రలు పోషించి ప్రేక్షకులను మెప్పించారు. కుబాకర్ మృతిపై ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్, జిల్లా కార్యవర్గ సభ్యులు సంతాపం తెలిపారు.



చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న ఎంఇఒ, సిఆర్‌పిలు

కిడ్నీ వ్యాధితో సిఆర్‌పి మృతి

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని బెలగాం క్లస్టర్ పరిధిలో సిఆర్‌పిగా పనిచేస్తున్న జీరు జయరాం (49) కిడ్నీ వ్యాధితో మంగళవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎంఇఒ ధనుంజయ మజ్జి, తోటి సిఆర్‌పిలు బుధవారం జయరాం కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ముందుగా జయరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసే జయరాం మృతి తమను కలిచివేసిందన్నారు.. అనంతరం సిఆర్‌పిల యూనియన్ తరుపున రూ.15 వేలు తక్షణ సహాయంగా అందజేశారు. జయరాంకు భార్య డిల్లేశ్వరి, కుమారుడు వాసు, కుమార్తె పవిత్ర ఉన్నారు.

తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి- నరసన్నపేట

ప్రమాదపుటంచున ఉన్న లారీ

మండలం జమ్ము జంక్షన్ సమీపంలో 16వ నెంబరు జాతీయ రహదారిపై లారీ అదుపు తప్పి ఫ్లైఓవర్ సైడు రైలింగ్‌ను బుధవారం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రైలింగ్‌కు ఉన్న సిమెంట్ పలకలు, ఒక విద్యుత్ స్తంభం విరిగిపోయింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవరకు బిపి పెరిగినందు వల్ల ఈ ప్రమాదం సంభవించిందని ప్రత్యేక్షంగా ఉన్న క్లీనర్ తెలిపారు. నేషనల్ హైవేపై జరగడం వల్ల వాహనాలు రాకపోకలకు అంతరాయం కలిగింది. ట్రాఫిక్ జామ్ ఏర్పడి ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వాహనాలను దారి మల్లించి ట్రాఫిక్ క్లియర్ చేసారు.

ఔషధాల తయారీ కేంద్రంగా ఎపి టొరియా ఫార్మా

రణస్థలం రూరల్: మూడున్నర దశబ్దాల పైబడి ఫార్మా రంగంలో జీవనాధార ఔషధాల తయారీలో ప్రముఖపాత్ర పోషిస్తు ఫార్మా రంగంలో దిగ్గజంగా సుస్థిర స్థానాన్ని సంతరించుకున్న అరబిందో ఫార్మా బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ నిర్ణయానుసారంగా బిజినెస్ ట్రాన్స్‌ఫర్ విధి విధానాలకు అనుగుణంగా అక్టోబర్ 1 నుండి 'యాక్టివ్ ఫార్మా ఇంగ్రిడియంట్(ఎపిఐ) విభాగాలు 'ఎపిటొరియా ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్'గా మనుగడలోకి వచ్చాయి. ఈ సందర్భంగా ఎపి టొరియా ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ పైడిభీమవరం యూనిట్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రసిడెంట్ కార్పొరేట్, హెచ్ఆర్ యున్‌బి.రాజు మాట్లాడుతూ అరబిందో ఫార్మా గత మూడున్నర దశబ్దాల చరిత్రను, విశిష్టతను వివరించారు. ప్రస్తుతం అరబిందో ఫార్మా మాతృ సంస్థగా ఎపిటొరియా ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ మాతృ సంస్థ ఆధీనంలో నిర్వహిస్తామని, భవిష్యత్తులో ప్రపంచ వ్యాప్తంగా బల్క్ డ్రగ్ పరిశ్రమల ఎదుగుదలకు అవకాశాలను, ఎపిటొరియా ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ అభివృద్ధికి విధివిధానాలను వివరించారు. సమావేశంలో స్థానిక యూనిట్ హెడ్ హెచ్ఆర్ కమలాకర్ రెడ్డి, హెచ్ఆర్ అధికారులతో పాటు కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాజు

పిహెచ్‌సిపిడబ్ల్యుఎ జిల్లా అధ్యక్షులుగా శిమ్మన్న

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ శ్రీకాకుళం శాఖ అధ్యక్షులుగా నగరానికి చెందిన వండాన శిమ్మన్న ఎన్నికయ్యారు. ఆయనతో పాటు కార్యదర్శిగా కె.సూరిబాబు, ట్రెజరర్‌గా నక్క లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులుగా కె.ఆదినారాయణ, జాయింట్ సెక్రటరీగా జనార్ధన్‌లను ఎన్నికయ్యారు. డేఅండ్‌నైట్ కూడలి వద్ద ఉన్న జెమ్స్ ఆస్పత్రిలో నూతన వైద్య విధానంపై అసోసియేషన్ సభ్యులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జెమ్స్ ఆస్పత్రి వైద్యులు శశిధర్, పైడి కిషోర్ కుమార్ కొత్త వ్యాధులు, ప్రథమ చికిత్సలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు తోరేటి ప్రభాకరరావు, వి.బి.టి.రాజు పాల్గొన్నారు.

నూతనంగా ఎన్నికైన సభ్యులతో జెమ్స్ వైద్యులు

రైతులను ఆదుకోవాలని వినతి

ఎండిన వరి దుబ్బును చూపిస్తున్న అప్పలనాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎచ్చెర్ల నియోజకవర్గం పరిధిలోని నారాయణపురం కుడి పంట కాలువ (ఎన్ఆర్‌సి) శివారు ఆయకట్టు రైతులను ఆదుకోవాలని పొందూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు, టిడిపినాయకులు కలిశెట్టి అప్పలనాయుడు కోరారు. ఈ మేరకు ఎండిన వరి మొనను జెసి ఎం.నవీన్‌కు చూపించి మాట్లాడారు. సాగునీరు అందకపోవడంతో శివారు గ్రామాలైన పొన్నాడ నుంచి కుప్పిలి వరకు ఉన్న వరి సాగు దెబ్బతిందని పొలాను పరిశీలించారు. అనంతరం జెసిని కలిసి మాట్లాడారు. కనీసం పెట్టుబడులూ రాని పరిస్థితి నెలకొందన్నారు. రైతులకు నష్ట పరిహారం అందేలా కృషి చేయాలన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ప్రజాశక్తి- పొందూరు

దీపావళి టపాసులు విక్రయదారులు నిబంధనలను ఉల్లంఘిస్తే అనుమతులు రద్దు చేయడంతో పాటు కఠినచర్యలు తప్పవని శ్రీకాకుళం డిఎస్‌పి వై.శృతి అన్నారు. బుధవారం వార్షిక తనిఖీలో భాగంగా ఆమె పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మండలంలో అత్యంత సమస్యాత్మక, సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. స్టేషన్‌లో పలు కేసులకు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం బురిడి కంచరాం, పిల్లలవలస కూడలి వద్ద దీపావళి మందుగుండు సామగ్రి విక్రయ కేంద్రాన్ని తనిఖీ చేశారు. విక్రయ కేంద్రాలు వద్ద అగ్నిప్రమాద నివారణ చర్యలు పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. ఈమెతో పాటు ఆమదాలవలస సిఐ పైడయ్య, ఎస్ఐ లక్ష్మణరావు ఉన్నారు.

బాణసంచా విక్రయ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిఎస్‌పి శృతి

చంద్రబాబుతోనే స్వర్ణయుగం

కోటబొమ్మాళి : పోస్టర్‌ను అందజేస్తున్న గోవిందరాజులు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

రాష్ట్రానికి స్వర్ణయుగం రావాలంటే టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితేనే సాధ్యమవుతుందని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓటువేయాలని రాష్ట్ర బిసి సాధికారిత కార్యదర్శి బోయిన గోవిందరాజులు అన్నారు. బుధవారం కోటబొమ్మాళి మేజరు పంచాయతీ హడ్కోకాలనీలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కరపత్రాలను టిడిపి నాయకులతో కలిసి అందజేశారు. ప్రతి ఇంటికి తిరిగి టిడిపి అధికారంలోకి రాగానే చేపట్టబోయే పథకాలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కమ్మకట్టు అప్పలరాజురెడ్డి, కోరాడ గోవింద, సకాలభక్తుల రాంకుమార్, కోరాడ చిన్న గోవింద, దేవాది అప్పలనాయుడు, దేవాది చిన్నారావు, కొండలరావు పాల్గొన్నారు. అలాగే మండలం హరిశ్చంద్రపురం పంచాయతీలో మాజీ ఎంపిటిసి హనుమంతు అప్పలరాజు ఆధ్వర్యంలో భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు.

వజ్రపుకొత్తూరు: టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ఆధ్వర్యంలో బుధవారం నువ్వలరేవులో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. బృందావతిమాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలతో మాట్లాడారు. టిడిపికి వచ్చే ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని కోరుతూ ఇంటింటికి కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో నాయకులు సూరాడ మోహనరావు, ఎ.ఉమామహేశ్వరరావు, శశిభూషణ్, మరడ దుర్యోధన, టి. గోపాలరావు, మాజీ ఎంపిటిసిలు బి. ఆనంద్, వెంకటేష్, మహిళలు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : బాబు షూరిటీ-భవష్యత్‌కు గ్యారంటీ పేరిట మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి శ్రీకాకుళం రూరల్ మండలం రాయిపాడులో రచ్చబండ నిర్వహించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు సీర రమణయ్య, జిల్లా ఉపాధ్యక్షులు చిట్టి మోహన్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు బలగ చెంగాలరావు, గేదెల శ్యామ్, ఎంపిటిసి రుప్ప చిట్టిబాబు, వార్డు నంబరు కిషోర్ పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : మండలంలోని మేఘవరం పంచాయతీలో టిడిపి మండల నాయకులు రెడ్డి అప్పన్న ఆధ్వర్యాన బాబు ష్యూరిటీ-భవిష్యత్ గారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టిడిపి మేనిఫోస్టోను వివరించారు. పరపరటి రాజశేఖర్‌రెడ్డి, సూరాడ రాయుడు పాల్గొన్నారు.

'ఆకాశం తాకిందా' పాట చిత్రీకరణ

ముహూర్తపు సన్నివేశాన్ని ప్రారంభిస్తున్న అన్నాజీరావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని ముద్దాడపేట గ్రామంలో సినీతారలు బుధవారం సందడి చేశారు. బీట్ లాబ్ మ్యూజిక్ ఇన్ఫినిటీ యూట్యూబ్ చానల్ నిర్మాణ సారథ్యంలో మ్యూజిక్ డైరెక్టర్ ఆది పొన్నాస్, మధు పొన్నాస్ ఆధ్వర్యంలో ఆకాశం తాకిందా అనే పాట షూటింగ్‌ను ప్రారంభించారు. ఈ ఆల్బమ్‌ను తెలుగుతో పాటు కన్నడ, మళయాళం, తమిళం, హిందీ, ఇంగ్లీష భాషల్లో రిలీజ్ చేస్తున్నట్టు బీట్ లాబ్ వ్యవస్థాపకులు బగాది కిషోర్ తెలిపారు. ఈ ఆల్బమ్‌ను ఒకేసారి ఆరుభాషల్లో విడుదల చేస్తున్న ఘనత బీట్‌లాబ్ నిర్మాణ సంస్థకు మాత్రమే దక్కనుందన్నారు. ఈ పాటలో కనబడుటలేదు చిత్రం ఫేమ్ సుక్రాంత్, సహస్రారెడ్డి హీరో హీరోయిన్లుగా నటించారని తెలియజేశారు. ఈ పాటకు సందీప్ బద్దుల డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ పాట చిత్రీకరణకు స్థానిక నాయకులు, పిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు చేతుల మీదుగా కొబ్బరికాయ కొట్టి ముహూర్తపు సన్నివేశాన్ని చిత్రీకరించారు. కార్యక్రమంలో పేడాడ శ్రీధర్, చింతు జగన్నాధం, బీట్‌లాబ్ ఫౌండర్స్ మల్లాది దివాకర్, కన్నేటి శివరామ రెడ్డి, ఆల్బమ్ నటీనటులు పాల్గొన్నారు.

ఇంటింటికీ పొదుపు పథకం

ఇచ్ఛాపురం: భారత ప్రభుత్వం-తపాలాశాఖ ద్వారా ప్రతి ఇంటికి పొదుపు పథకాలను పరిచయం చేస్తూ "ఇంటింట పొదుపు పంట" అనే నూతన కార్యక్రమాన్ని అక్టోబర్ 25 నుంచి 30 వరకు వివిధ కార్యక్రమాల ద్వారా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకు వెళ్తుందని శ్రీకాకుళం తపాలాశాఖ పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ పి.శ్రావణ్ కుమార్ అన్నారు. శ్రీకాకుళం పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ ఇచ్ఛాపురం ఉపతపాలా కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి ఒక పోస్టల్ ఖాతాను అందించాలనే ముఖ్య ఉద్దేశంగా ఈ కార్యక్రమంలో భాగంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. పోస్టల్ శాఖ అందిస్తున్న ఫిక్స్ డిపాజిట్స్, టెర్మ్ డిపాజిట్స్ వంటి వివిధ రకాల పొదుపు పథకాలు, వాటి సౌలభ్యతపై వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో పొదుపు పథకాల ఆవశ్యకత, అందిస్తున్న సేవలను వివరించారు.

యాత్రను ప్రారంభిస్తున్న కృపారాణి తదితరులు

జగన్ సిఎం కావాలని గురునాథ్ యాదవ్ పాదయాత్ర

టెక్కలి రూరల్ : టెక్కలి నుండి తిరుపతి దేవస్థానానికి జి.గురునాథ్ యాదవ్ బుధవారం తన స్వగృహం నుంచి పాదయాత్ర ప్రారంభించారు. ఈ పాదయాత్రకు కలీం కార్పొరేషన్ చైర్మన్ పేడాడ తిలక్, మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి కొబ్బరి కాయ కొట్టి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు డాక్టర్ కిల్లి రామ్మోహనరావు, చింతాడ మంజు గణపతి, ఎంపిటిసి శ్రీధర్ రెడ్డి, వార్డు సభ్యులు నూనెల సోమేష్ పాల్గొన్నారు.

క్రీడలకు ప్రభుత్వ ప్రోత్సాహం

ప్రజాశక్తి- నందిగాం

క్రీడల అభివృద్ధికి సిఎం జగన్మోహన్‌రెడ్డి పూర్తి సహాయ సహకారాలు అందజేస్తున్నారని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న మండల స్థాయి గ్రిక్స్ క్రీడాపోటీలను ఎంపిపి నడుపూరు శ్రీరామమూర్తితో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులంతా క్రీడల్లో పాల్గొనాలని కోరారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో దాగివున్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఈ పోటీలు ఉపయోగపడతాయన్నారు. ప్రతిఒక్కరూ క్రీడల్లో పాల్గొని పోటీ తత్వం అలవర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకృష్ణారావు, సర్పంచ్. ప్రతినిధి జడ్యాడ జయరాం, ఎంపిటిసి ప్రతినిధి అంబోడి విష్ణు, మండల పరిషత్ ప్రత్యేక అహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ సనపల చిన్నారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

పరామర్శిస్తున్న గోవిందరావు

'ఎంజిఆర్' పరామర్శ

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలో నేరడి గ్రామానికి చెందిన పడాల వెంకటరావు, పడాల సత్యారావు అక్క తలగాపు రత్నాలమ్మ అనారోగ్య సమస్యలతో బాధపడుతుండడంతో పారిశ్రామిక వేత్త, టిడిపి నాయకులు మామిడి గోవిందరావు బుధవారం పరామర్శించారు. అలాగే పాతపాడు గ్రామానికి చెందిన బిల్లింగి భాస్కరరావును, నివగాం గ్రామంలో వాడ త్రినాధ్ ఇటీవల మేడపై నుండి జారిపడిపోయి కాలు విరిగిన కారణంగా బాధపడుతున్న ఆయనను పరామర్శించారు. అలాగే నివగాం గ్రామంలో కందల అప్పయ్య భార్య కందల లక్ష్మి ఇటీవలే అనారోగ్య కారణంగా పెద్ద ఆపరేషన్ చేసుకున్న విషయం తెలుసుకొని వారిని పరామర్శించారు. గూనభద్ర కాలనీకి చెందిన పోడ్డిన శాంతరావు కుమారుడు పోడ్డిన తిరుపతి పాము కాటుకు గురై కొత్తూరు ప్రాథమిక ఆసుపత్రిలో చికిత్స పొదుతున్న విషయం తెలుసుకొని పరామర్శించారు. ఈయనతో పాటు కొత్తూరు మాజీ ఎంపిపి ఎద్దు దాసునాయుడు ఉన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపక బృందం

రాష్ట్రస్థాయి పోటీలకు పయనం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రభుత్వ ఉన్నత పాటశాలకు చెందిన నలుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నవంబర్ 9 నుండి 11 వరకు కడప జిల్లా రైల్వే కోడూరులో స్కూల్‌గేమ్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరగబోయే రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ప్రభుత్వ బాలుర హైస్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. వీరు బుధవారం రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్తున్నారు. అండర్-17 విభాగంలో రేవంత్, సిహెచ్ గిరి, ఎస్. జైరామ్, అండర్-14 విభాగంలో టి. జీవన్ కుమార్‌లను హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు విశ్వనాథం, పిఇటిలు శారద, గణేష్, ఉపాధ్యాయులు కామరాజు, నందిక జోగేష్, జయలక్ష్మి అభినందించారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని బుధవారం మండల విద్యాశాఖ అధికారులు ఎస్.దేవేందర్‌రావు, మల్లారెడ్డి పద్మనాభం పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి మధ్యాహ్న భోజన నిర్వహణపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం భోజనాన్ని, స్టాక్ రూంను పరిశీలించారు. విద్యార్థులకు అందించే భోజనం నాణ్యత విషయంలో రాజీపడేది లేదని స్పష్టం చేశారు. మెనూ సక్రమంగా అమలు చేయాలని, నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం యు.గణపతిరావు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ యు.దిలీప్ కుమార్, మహిళా పోలీస్ భారతి పాల్గొన్నారు.

కృత్యాధార బోధనపై శిక్షణ

శ్రీకాకుళం అర్బన్ :యూత్ క్లబ్ బెజ్జిపురం ఆధ్వర్యాన బెంగుళూరుకు చెందిన ఇండియా లిటరసీ ప్రాజెక్టు సహకారంతో బాలవికాస్ ప్రోగ్రాంలో భాగంగా అంగన్వాడీ కార్యకర్తలకు కృత్యాధార బోధనపై రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. యూత్ క్లబ్ డైరెక్టర్ వై.ప్రసాదరావు మాట్లాడుతూ కృత్యాధార బోధన వల్ల చిన్నారుల్లో మానసిక పరిపక్వత సాధ్యమవుతుందన్నారు. ఆటాపాటల ద్వారా విద్య నేర్చడం అలవాటుగా మార్చుకోవాలన్నారు. ఆలోచనా శక్తిని పెంచే ఈ విధానం ఎంతో ఉపయోగకరమన్నారు. ప్రాజెక్టు లెర్నింగ్ కో-ఆర్డినేటర్ టి.కరుణాకరరావు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్ పూర్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులతోనే ప్రారంభమవుతుందని అన్నారు. కో-ఆర్డినేటర్ పి.మాధవి ప్రాజెక్టు వివరాలను తెలియజేస్తూ పూర్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు కృత్యాధర బోధన అభినయ గేయాలు, బోధన వల్ల అభ్యాసన గుణం పెరుగుతుందని అన్నారు. తద్వారా

మాట్లాడుతున్న కరుణాకరరావు

ఆలోచనల్లో మార్పు వస్తుందన్నారు. విద్యా వ్యవస్థ విద్యార్థి కేంద్రీకృతంగా ప్రయాణం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్స్ వై.శంకరరావు, ఎ.రమణమూర్తి, కె.శ్రావణి, ఆర్.కల్పన, ఆర్.వనిత, ఫెసిలిటేటర్ పి.ఉమ మహేశ్వరరావు, జి.హేమసుందర్, యు.మెహెర్ వాణి, పి.అప్పలనాయుడు, బి.సంతోషి పాల్గొన్నారు.

సాగునీటి ప్రాజెక్టుల కోసం పోరాడుదాం

పలాస : సాగునీటి ప్రాజెక్టుల కోసం పోరాడాలని అఖిలభారత రైతుకూలీ సంఘం జిల్లా మహాసభలో తీర్మానించినట్లు వంకల మాధవరావు ప్రకటించారు. వంశధార ఎడమ కాలువ ఇచ్ఛాపురం వరకు పొడిగించాలని, సాగునీరు లేక రైతాంగం పంట పొలాలు ఎండిపోతున్నాయని, రైతులు వలసలు పోతున్నారని, వలసలు నివారించాలంటే సాగునీటి ప్రాజెక్టులను కట్టాలని ఆయన ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. వంశధార కాలువ ఇచ్ఛాపురం వరకు పొడిగించాలని మహా సభలో తీర్మానించినట్లు ప్రకటించారు. జీడి పంటకు 80 కేజీల బస్తాలకు రూ.16 వేలు మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. కొబ్బరి, జీడి బోర్డ్ ఏర్పాటు చేయాలని తీర్మానించారు. ఆదివాసి గ్రామాలన్నీ ఐదో షెడ్యూల్లో చేర్చాలని, 1/70 చట్టం అమలు చేయాలని, ఆదివాసి ప్రాంతంలో భూములకు రక్షణ కల్పించాలని, పోడు భూములకు 10 ఎకరాల పట్టాలు మంజూరు చేయాలని మహాసభలో తీర్మానాలు చేసినట్లుగా ఆయన ప్రకటించారు. అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు సమక్షంలో నూతన జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మామిడి భీమారావు, కార్యదర్శి బైరి కూర్మారావు, ఉపాధ్యక్షుడిగా సవర బంగ్లాకుమార్, సహాయ కార్యదర్శిగా జి.లక్ష్మణరావు, కోశాధికారిగా వంకల పాపయ్య, మురిపిండి తాతారావు, కార్యవర్గ సభ్యులుగా ఎస్.మోహన్, కె.సోమేష్, ఎస్. సూరయ్య, సోమేశ్వరరావు, సవర సోమేశ్వరరావులను ఏకగ్రీవంగా మహాసభ ఎన్నిక జరిగింది.

పలువురికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- రణస్థలం

మండలం జెఆర్ పురం పంచాయితీ గొల్లపేట గ్రామానికి చెందిన బేతా సంతోష్ కుమార్ ఆగస్టు 31న చిలకపాలెం జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. సంతోష్ కుమార్ రణస్థలం స్టేట్‌బ్యాంకులో సేవింగ్ అకౌంట్ ద్వారా రూ.500తో యానోపాల్ పర్సనల్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ చేయించడంతో బ్యాంకు వారికి అవసరమైన ధ్రువపత్రాలను అందజేసిన నెల రోజుల్లోనే నామిని మృతుని భార్య బేతా శ్రావణికి రూ.10 లక్షలు చెక్కును గురువారం రణస్థలం స్టేట్ బ్యాంకులో బ్రాంచ్ మేనేజర్ జి.హరినారాయణరావు అందజేశారు. కార్యక్రమంలో క్యాషియర్ దేశెట్టి హరిప్రసాద్, జనరల్ బిడిఎం ఎల్ఎన్ పట్నాయిక్, సేవా ఫౌండేషన్ అధ్యక్షులు తిరుపతిరాజు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మండలంలోని కేసుపురానికి చెందిన శివాంగి కూర్మారావు, భూలక్ష్మి దంపతుల కుమారుడు 10 నెలల చిన్నారి హర్షవర్ధన్ బొన్ మారో వ్యాధితో బాధపడుతున్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబం కావడంతో వైద్య ఖర్చులకు తక్షణ సహాయంగా చిన్నారి తల్లిదండ్రులకు రూ.6 వేలు అందజేశారు. మరిన్ని స్వచ్ఛంద సంస్థలు వచ్చి చిన్నారులకు ఆదుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు చలపతి, కార్యదర్శి సురేష్, సభ్యులు నాగు, ఆశిష్, భాస్కర్, రమేష్, బాష

సంతోష్ కుటుంబానికి నగదు అందిస్తున్న స్నేహితులు

పాల్గొన్నారు.

బూర్జ :మండలం ఒపివాడ వెంకంపేట ప్రభుత్వం ఉన్నత పాఠశాలలో 2004-2005లో పదోతరగతి చదువుకున్న విద్యార్థులు తమతోటి స్నేహితుడు తుమరాడ సంతోష్ అనారోగ్యంతో మృతి చెందాడు. సంతోష్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. సంతోష్ తండ్రి చిన్నారావుకు రూ.45 వేలు సహాయాన్ని బుధవారం అందించారు. తమ స్నేహితుడు కుటుంబానికి అండగా తమ వంతుగా స్నేహితులు అంతా కలిసి రూ.45 వేలు అందించి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కొల్ల జయరాం, మాజీ ఎంపిపి బొడ్డేపల్లి సూర్యరావు, బగాది అప్పలనాయుడు, బగాది భాస్కరరావు, బగాది నరసింగరావు, బలగ మల్లేశ్వరరావు, అమలాపురం రాజు, చింతాడ ఈశ్వరరావు ఉన్నారు..

హమాలీల సమస్యలు పరిష్కరించాలి

శ్రీకాకుళం అర్బన్ : ఆంధ్రప్రదేశ్ స్టేట్ సివిల్ సప్లయి కార్పొరేషన్ మండల స్టాక్ పాయింట్లలో లోడింగ్, అన్‌లోడింగ్ పనులు నిర్వహిస్తున్న హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించి, పనిభద్రత కల్పించాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటసుబ్బయ్య ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. అరసవల్లిలో జిల్లా అధ్యక్షులు కె.శ్రీమన్నారాయణ అధ్యక్షతన జిల్లా సివిల్ సప్లయి హమాలీ యూనియన్ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం సివిల్ సప్లయి కార్పొరేషన్‌లో పనిచేస్తున్న హమాలీ ముఠా కళాసీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందన్నారు. కరోనా వంటి కష్ట కాలంలోనూ ప్రాణాలకు తెగించి ప్రజలకు నిత్యం రేషన్ బియ్యం అందించడంలో కీలకంగా

మాట్లాడుతున్న వెంకటసుబ్బయ్య

వ్యవహరించాలరన్నారు. హమాలీలు దాచుకున్న పిఎఫ్ సొమ్మును సైతం సక్రమంగా అందించడం లేదని ఆరోపించారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చిక్కాల గోవిందరావు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి అనపాన షణ్ముఖరావు, మేస్త్రీలు వంకల రామయ్య, ఎన్.గణపతి, డొక్కర షణ్ముఖరావు, ఎ.రాము, సింహాచలం, వి.రాము, ఎన్.సీతయ్య, కె.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు అవమానం

ఆమదాలవలస : రాష్ట్రంలో బోగస్ బస్సు యాత్రను చేపట్టిన వైసిపి మంత్రులు, నాయకులు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ బి.ఆర్.అంబేద్కర్‌ను ఘోరంగా అవమానించారని టిడిపి రాష్ట్ర కార్యదర్శి, జిల్లా దళిత సంఘం నాయకులు బోనెల అప్పారావు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి 'నా ఎస్‌సి... నా ఎస్‌టి.. నా బిసి అంటూ సామాజిక సాధికారక బస్సు యాత్ర పేరుతో మంగళవారం వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి... పట్టణ నడిబొడ్డున ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేయకుండా అవమానించడం తగునా? అని ప్రశ్నించారు. ఇదేనా సామాజిక సాధికార యంత్ర అని ప్రశ్నించారు. సమావేశంలో రాష్ట్ర మైనార్టీ విభాగ ఉపాధ్యక్షులు రాడ విజయ్‌కుమార్, నియోజకవర్గ ఎస్‌సి సెల్ కన్వీనర్ గుర్రాల చినబాబు, సరుబుజ్జిలి మండల ఎస్‌సి సెల్ కన్వీనర్ ఇల్లాకుల ప్రభాకర్, దళిత నాయకులు మండ వెంకటరావు, మొయ్య రమణ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి- టెక్కలి

మండలంలోని చాకిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న జలుమూరు విశ్వనాథం, ఎం.శ్రావణిలు రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ సాఫ్ట్‌టెన్నిస్ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.అనురాధ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక కాబడ్డ వీరు కాకినాడలో ఈ నెల 9న జరగబోయే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆదే విధంగా ఆత్మకూరులో జరగనున్న నెట్‌బాల్ రాష్ట్రస్థాయి క్రీడలకు జలుమూరు జగన్ ఎంపిక కాబడ్డారని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కాబడ్డ విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయులు బాడాన

విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నారాయణరావులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనురాధతో పాటు ఉపాధ్యాయులు కురమాన దాలయ్య, పొట్నూరు జగదీష్, కాపల నారాయణరావు, పి.చిన్నారావు, సుధారాణి, భారతి, ఆనందరావు, రుషి అభినందించారు.

గౌతు శిరీష పరామర్శ

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో కాశీబుగ్గకు చెందిన జగ్గారావు, పలాసకు చెందిన రట్టి అప్పలమ్మ, పొందర కృష్ణ పాత్రో, పలాస మండలం పెదంచలకు చెందిన వల్లభ నారాయణ, మందస మండలం లింబుగాంకు చెందిన మండల మాదయ్య, మందసకు చెందిన రామస్వామి తల్లి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష మృతుల కుటుంబాలను బుధవారం పరామర్శంచి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమెతో పాటు టిడిపి నాయకులు లొడగల కామేశ్వరరావు, గాలి కృష్ణారావు, బావన దుర్యోధన, రట్టి లింగరాజు లబ్బ రుద్రయ్య దాసరి తాతారావు, తలగాన నరసింహమూర్తి ఉన్నారు.